# దివ్యాంగుల సంక్షేమం అందరి బాధ్యత

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి


హన్మకొండ: దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం అందరి బాధ్యత అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఎఫ్‌ఎంఎం సాంఘీక సేవా సంస్థ కార్యాలయంలో వనం మహిళా సహకార సంఘం, ఎఫ్‌ఎంఎం సంస్థ ఆధ్వర్యంలో సంఘీభావ దినోత్సవం జరిగింది. ఇందులో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరంతో పాటు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో వృద్ధులు, దివ్యాంగులను సంకుచిత బావంతో చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని చేరదీసి చేతనైన సహాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా 300 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఎఫ్‌ఎంఎం సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ రెజీనా చిన్నప్ప, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు అనితారెడ్డి, మెడికేర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ చిన్నపరెడ్డి, వనం మహిళా సంఘం కార్య నిర్వాహక అధికారి సిస్టర్ నిర్మల, అధ్యక్షులు లూర్దు మేరీ, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

**సకాలంలో పన్ను చెల్లిస్తే సమస్యలు దూరం**

వరంగల్ చౌరస్తా : సకాలంలో పన్నులు చెల్లిస్తేనే సమస్యలు దూరమవుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం హంటర్ రోడ్‌లోని ఐసీఏఐ బ్రాంచ్ కార్యాలయంలో ది రోల్ ఆఫ్ జీఎస్టీ ఇన్ షేపింగ్ బిజినెస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరు కాగా, విశిష్ట అతిథిగా వస్తు సేవా పన్నుల కమిషనర్ ఆర్కే రామన్ ఐఆర్‌ఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య రంగాల్లో ఎలాంటి ఒడిదుడుకులు ఉన్నా గడువులోపే పన్ను చెల్లించాలన్నారు. కమిషనర్ ఆర్కే రామన్ మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు జీఎస్టీ పరిధిలోకి వస్తాయని వాటిని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఐసీఏఐ వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ మాట్లాడుతూ జీఎస్టీ పన్ను చెల్లింపు, ఇన్‌కమ్ టాక్స్ విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ మధుకర్ రెడ్డి, హన్మకొండ జిల్లా జనరల్ మేనేజర్ హరిప్రసాద్, చైర్మన్ ఆఫ్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ కమిటీ ఎఫ్‌టీసీసీఐ మహమ్మద్ ఇర్షాద్ అ మిద్, ఐసీఏఐ బ్రాంచ్ వైస్ చైర్మన్ భగవాన్ దాస్ ముండాడ, సెక్రటరీ పూజారి సత్యనారాయణ, వ్యాపార వాణిజ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేతాజీ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం

**నేతాజీ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామని పలువురు వక్తలు అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. సైకిల్ వాకర్స్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రతాపరుద్రకాలనీనుంచి హనుమకొండ చౌరస్తావరకు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేతాజీ జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వాతంత్రం ఉద్యమంలో నేతాజీ ప్రధాన పాత్ర పోషించి బ్రిటీష్ పాలకులను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహా నాయకుడని కొనియాడారు.**

– సాక్షి, నెట్‌వర్క్


హన్మకొండ : నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కేయూ క్యాంపస్: కేయూ లైబ్రరీ వద్ద..


హన్మకొండ చౌరస్తా: సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


వరంగల్ : ఎల్‌బీనగర్‌లో నేతాజీ జయంతి వేడుకల్లో ఏఐఎస్‌బీ నాయకులు

## 25న టీపీసీసీ సదస్సును విజయవంతం చేయండి

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రస్థాయి సదస్సుకు కార్పొరేటర్లు, మండల పార్టీ, బ్లాక్ కాంగ్రెస్, డివిజన్, అనుబంధ సంఘాల, బూత్ అధ్యక్షులు, టీపీసీసీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సదస్సుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని తెలిపారు.

## ఎంజీఎం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఆందోళన

ఎంజీఎం : తనను విధుల నుంచి అక్రమంగా తొలగించారని పేర్కొంటూ ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని రాజమ్మ మంగళవారం మధ్యాహ్నం ఎంజీఎం సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టింది. రాజమ్మ విధుల్లో ఉన్న హెడ్‌నర్సును దూషించిందనే కారణంతో ఆస్పత్రిలో ఉన్న నర్సింగ్ ఉద్యోగినులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన అధికారులు ఆమెను విధులు నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. విచారణలో తనకు అన్యాయం జరిగిందని, తనను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సూపరింటెండెంట్ చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టింది.

# ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

కేయూ క్యాంపస్ : ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేయాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ అధికారులను డిమాండ్ చేశారు. ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ సర్వసభ్య సమావేశం కేయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న దినసరి వేతన లంసమ్, క్యాజువల్ ఉద్యోగులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌గా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. దీంతో ఉద్యోగుల్లో అభద్రతాభావం ఏర్పడి మానసికంగా కంగిపోతున్నారన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ దినసరి వేతన ఉద్యోగులను టైం స్కేల్ ఉద్యోగులుగా మార్చాలన్నారు. సమావేశానికి ఆల్ యూనివర్సిటీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కచ్చకాయల చిరంజీవి, కేయూ సీఐటీయూ అధ్యక్షుడు ఆకుతోట రామచందర్, వైస్ ప్రెసిడెంట్ పల్లం రాజు బాధ్యులు ఎం.మధు వి.నిరంజన్‌రెడ్డి,డి.కష్ణ, నవీన్, పి.శోభ శ్రీనివాస్, కేటగిరీల ఉద్యోగులు పాల్గొన్నారు.

# అతిక్రమణల కూల్చివేత

వరంగల్ అర్బన్ : ఓ షాపింగ్ మాల్ అతిక్రమణలకు పాల్పడడంతోపాటు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోకపోవడంపై పలుమార్లు నోటీసులు జారీ చేసినా యజమాని స్పందించకపోవడంతో వాటిని బల్దియా సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు సిటీ ప్లానర్ వెంకన్న నేతృత్వంలో పోలీసుల సహకారంతో షాపింగ్ మాల్ గోడలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ బాషా విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ చౌరస్తాలోని ఓ షాపింగ్ మాల్ యాజమాన్యం బిల్డింగ్ నిర్మాణానికి సెల్ట్, ఫోర్ ఫ్లస్ అనుమతులు పొంది ఆ భవనాన్ని కమర్షియల్ అవసరాలకు వినియోగించుకుంటున్నాని తెలిపారు. ప్రధాన రోడ్డువైపు ఉన్న ప్రాంతాన్ని కబ్జా చేసి సొంతానికి వాడుకుంటున్నారన్నారు. ఆ భవనానికి సెల్లార్ నిర్మాణానికి అనుమతి లేదని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందకుండా ఆక్రమణలు చేపట్టారని తెలిపారు. పూర్తిస్థాయిలో అనుమతి తీసుకోలేని కారణంగా తొలగించినట్లు చెప్పారు. ఆ షాపింగ్ మాల్‌కు విద్యుత్ కనెక్షన్ తొలగించాల్సిందిగా ఎన్‌పీడీసీఎల్ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. అతిక్రమణలను గుర్తించి సదరు యాజమాన్యానికి పలుమార్లు నోటీసులు అందజేశామని, అయినప్పటికి రాతపూర్వకంగా ఎలాంటి స్పందన లేదన్నారు. అందువల్ల సెల్ట్ పోర్షన్ పార్కింగ్ గోడలు, రోడ్డు ఆక్రమణను తొలగించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని తొలగించినట్లు చెప్పారు.

**రహదారుల విస్తరణపై కొరడా**

నగరంలో సెల్లార్, డీవియేషన్, రోడ్డు ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ సిబ్బంది కొరడా ఝుళిపించారు. వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్, ఎంజీఎం సెంటర్ వరకు చేపట్టిన ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. రోడ్డుపై చొచ్చుకొచ్చిన ర్యాంప్‌లు, బోర్డులు తొలగించారు. అంతేకాకుండా హనుమకొండ జాలేశ్వరాలయం పక్కన ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో బల్దియా టౌన్ ప్లానింగ్, డీఆర్‌ఎఫ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌పీఐ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

హన్మకొండ: హనుమకొండలో ఈ నెల 28న జరగనున్న రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త జన్ను సాంబయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో రాష్ట్ర సదస్సు కరపత్రాలను రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఆయా సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ హనుమకొండ రాంనగర్‌లో రాష్ట్ర సదస్సు జరుగుతుందని తెలిపారు. సదస్సుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నూతన రాష్ట్ర, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకుని పార్టీని పటిష్టం చేస్తూ, మరో రైపు అంబేడ్కర్, అభ్యుదయ వాదులను, సీనియర్ నాయకులను ఏకం చేస్తూ ముందుకు సాగుతామన్నారు కార్యక్రమంలో సామాజిక, రాజకీయ విశ్లేషకులు నరేందర్, న్యాయవాదులు జైపాల్, ప్రవీణ్ కుమార్, భవాని ప్రసాద్, రంజిత్ గౌడ్, ఆయా సంఘాలు, అరుణ అన్వేష్, సాంబశివ రాజు, సాగర్, రాజు, గణేష్ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



కరీమాబాద్ : వరంగల్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జిల్లా రెవెన్యూ సంఘం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఏఓ శ్రీకాంత్, తహసీల్దార్లు ఎక్బాల్, విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌యూపీపీ క్యాలెండర్..**



కాళోజీ సెంటర్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ)–2024 క్యాలెండర్‌ను వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాకర్ల రమేష్, ప్రధాన కార్యదర్శి మురళీధర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అన్నారు. గ్రేటర్ పరిధిలోని 42వ డివిజన్ ఆదర్శ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్ల్ చైల్డ్ డేను పురస్కరించుకుని మొక్కలు నాటారు.అంగన్‌వాడీ టీచర్ అనిత, జ్యోతిరాణి, వినీత, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాపోటీలు ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విశ్రాంత బోధన, బోధనేతర ఉద్యోగులకు మంగళవారం స్పోర్ట్స్ బోర్డులో పలు క్రీడాపోటీలను కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ ప్రారంభించారు. వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, టెన్నీస్ పోటీలను ప్రారంభించారు. ఆయా సంఘాల రిటైర్డ్ బాధ్యులు ఎం. ఎర్రగట్టుస్వామి, సంగాలగిడియన్ తదితరులు పాల్గొన్నారు.

### మేయర్ పరామర్శ



వరంగల్ అర్బన్ : వరంగల్ ఎల్‌బీ నగర్‌లో కుక్కకాటుకు గురైన బాలుడిని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి పరామర్శించారు. మంగళవారం ములుగు రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని పరిశీలించిన ఆమె వారి, తల్లిదండ్రులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ ఫుర్కాన్, బీఆర్‌ఎస్ నాయకుడు పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.

### రీడింగ్ ప్యాడ్స్ పంపిణీ



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న గ్రంథ పాఠకులకు మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా రీడింగ్ ప్యాడ్స్‌ను అందజేశారు. గ్రంథాలయంలోని చైర్మన్ చాంబర్‌లో లైబ్రరీ సెక్రటరీ శోజాదేవీతో కలిసి ఆమె పాఠకులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారీ, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీనివాస్‌రెడ్డికి అవార్డు

హసన్‌పర్తి: తెలంగాణ ప్రైవేట్ అధ్యాపకుల సంఘం నేత డాక్టర్ సంకేపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ఆచార్య గిడుగు రామమూర్తి అవార్డుతో సత్కరించారు. ఆయన రాసిన 'శంఖారావం'కవిత సంపుటికి ఈ పురస్కారం లభించింది. రామమూర్తి పంతులు ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగింది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రయ్య, ప్రముఖ రచయిత డాక్టర్ కృష్ణ చేతుల మీదుగా శ్రీనివాస్‌రెడ్డి అవార్డు అందుకున్నారు. అలాగే 'జీవన వీణ' కవితా సంపుటికి కీర్తనారెడ్డిని సత్కరించారు.

### నల్ల చట్టాలను రద్దు చేయాలి

ఖిలా వరంగల్: రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వీరగోని శంకరయ్య , ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సుక్క మొగిలి అధ్యక్షతన రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆరెల్లి ప్రభాకర్, ఎంఏ పాషా, శోభ, రత్నాకర్ రెడ్డి, ఎండి యాకోబ్ పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల నిరసన

వరంగల్ అర్బన్ : న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ కమ్ ఓనర్లు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్మికులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**హక్కులపై అవగాహన కల్పించాలి**

వరంగల్ లీగల్ : ఆడపిల్లలకు వారి హక్కులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హనుమకొండ న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కోర్టులోని న్యాయసేవా సదన్ బిల్డింగ్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ లింగ వివక్షను రూపుమాపడానికి, మహిళా సాధికారత కోసం పోరాటం అనేవి బాలికల దినోత్సవ ముఖ్య లక్ష్యాలని తెలిపారు.

**మాయమైన గొలుసు లభ్యం**

హసన్‌పర్తి: ఓ వివాహిత మెడలో నుంచి మాయమైన బంగారు గొలుసు ఇంట్లోనే దొరికింది. నాలుగు రోజుక్రితం ముచ్చర్లకు చెందిన రమాదేవి ఇంటిలో నిద్రిస్తుండగా మెడలో నుంచి బంగారు గొలుసు మాయమైంది. ఈ మేరకు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వివిధ కోణాల్లో విచారించారు. మంగళవారం ఉదయం గొలుసు ఇంటి ఆవరణలో ప్రత్యక్షమైంది. ఈ మేరకు ఆ గొలుసును స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి బాధితురాలు రమాదేవికి అందించారు.

**వర్క్‌షాప్‌తోనే అవగాహన**

కాళోజీ సెంటర్ : వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థుల్లో విషయ అవగాహన పెంపొందుతుందని జిల్లా సైన్స్ అధికారి, జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నగరంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నేషనల్ గ్రీన్ కాప్స్ కార్యశాల(ఎన్జీసీ) నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 50 పాఠశాలల నుంచి సుమారు 150 విద్యార్థులు, 50 మంది ఎన్జీసీ ఇన్‌చార్జ్ టీచర్లకు రాష్ట్ర ఎన్జీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, బృందంచే' పర్యావరణ హిత జీవన శైలి' పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి నిర్వహించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై, పర్యావరణానికి సంబంధించిన అనేక అంశాలపై, జీవవైవిధ్య సంరక్షణపై విషయ నిపుణులు శివకరణ్ ఎగ్జిబిట్స్‌తో వివరించారు.

**బోధనేతర సిబ్బంది కమిటీ ఎన్నిక**

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌జీఓ), నాల్గో తరగతి ఉద్యోగ సంఘానికి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన వారి వివరాలు మంగళవారం తెలిపారు. అధ్యక్షుడిగా భూక్య రాజు, ఉపాధ్యక్షుడిగా ఏ.కార్తిక్, ప్రధాన కార్యదర్శిగా సుశీల్, జాయింట్ సెక్రటరీగా ఎండీ.నిజాముద్దీన్, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీగా ఎస్.బాలయ్య, రిక్రియేషన్ ట్రెజరర్‌గా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య తెలిపారు. వీరి పదవి 2026 వరకు కొనసాగుతారు.

**పెండింగ్ డీఏలను విడుదల చేయాలి**

కాళోజి సెంటర్ : ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ విజయకుమార్‌తో కలిసి మనోజ్‌కుమార్ ఆవిష్కరించారు.

**బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా సురేందర్**

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, గ్రేటర్ వరంగల్ ఉపాధ్యక్షుడిగా వరంగల్ 26వ డివిజన్ గిర్మాజీపేటకు చెందిన పోశాల సురేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు లయన్ అప్పరాజు రాజు నియామక పత్రాన్ని జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు డాక్టర్ తాళ్ల రవి, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణకు సురేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

**రీసైక్లింగ్ పర్యావరణానికి మేలు**

నయీంనగర్: రీసైక్లింగ్ విధానం పర్యావరణానికి మేలు చేస్తుందని రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ అన్నారు. మంగళవారం హనుమకొండ కిషన్‌పుర మాస్టర్‌జీ హై స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నుంచి వాడిన పుస్తకాలను, రాసిన నోట్స్‌లను సేకరించి వాటి విలువకు సరిసమానమైన ఐటీసీ ఉత్పత్తులను విద్యార్థులకు ఇచ్చి దాంతో పాటు ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను పాఠశాల హెచ్‌ఎం రజిత ఆవిష్కరించారు.

**కార్మిక నేత హనుకాంత్‌కు సన్మానం**

కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్‌లో మంగళవారం రైల్వే కాలనీకి చెందిన షెడ్యూల్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్‌ను సన్మానించారు. ఇటీవల హెచ్‌ఎస్‌సీ హోలిస్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ వారు హనుకాంత్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ మేరకు కార్మికులు హనుకాంత్‌ను సన్మానించారు. హనుకాంత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అధికారులు, కార్మికులతో కలిసి సామాజికంగా,కార్మికుల కోసం మరిన్ని కార్యక్రమాలు, అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు.

**శంకర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే**

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇంగ్లీష్ విభాగం పరిశోధకుడు, దివ్యాంగుడైన దేవసోత్ శంకర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపురం గ్రామానికి చెందిన శంకర్ దివ్యాంగుడైనప్పటికీ కష్టపడి చదువుకున్నారు. హనుమకొండలోని దివ్యాంగుల బాలుర వసతిగృహంలో ఉండి ఎంఏ ఎంఈడీ పూర్తి చేశాక కేయూ ఇంగ్లీష్ విభాగంలో అమితావ్ ఘోష్ సెలెక్ట్ ఫిక్షన్ ఏ స్టడీ ఇన్ హిస్టారికల్ పర్‌స్పెక్టివ్ అనే పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఇటీవలనే డాక్టరేట్‌ను సాధించిన శంకర్‌ను మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.

**ఉర్దూ భాష అభ్యున్నతికి పాటుపడాలి**

న్యూశాయంపేట : ఉర్దూ భాష అభ్యున్నతికి పాటుపడాలని వరంగల్ ఇస్లామియా కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బహదూర్‌అలీ తెలిపారు. మంగళవారం వరంగల్ ఎల్‌బీనగర్ గోల్డెన్ గెస్ట్‌హౌజ్‌లో ఇటీవల మరణించిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రఖ్యాత కవి మునవర్‌రాణా సంస్మరణ సభలో ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ కవి తాజ్ ముస్తార్ అధ్యక్షతన జరిగిన సభలో బహదూర్‌అలీ మాట్లాడుతూ మునవర్ రాణా తన కవితలతో ప్రజలను ఉత్తేజితులు చేశారని గుర్తుచేశారు.

**రూ.10, 20ల నాణేలు చెల్లుబాటు**

కాశిబుగ్గ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన రూ.10లు, రూ.20ల నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని వరంగల్ చీఫ్ కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ బి.రాజగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ దగ్గర రూ.10లు, రూ.20ల నాణేల వల్ల ప్యాసింజర్లకు ప్రతి రోజు టికెట్ జారీ చేసిన సమయంలో ఈ నాణేలు తీసుకోవడం లేదని దీనిపై ప్రతి రోజు వాగ్వాదం అవుతుందన్నారు. ఈనాణేలు ఆర్‌బీఐ జారీ చేసిందని బ్యాంకుల్లో చెల్లుబాటు అవుతున్నాయని అన్నారు.

**నేటి నుంచి స్పార్కిల్ ఉత్సవాలు**

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో స్పార్కిల్ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. తొలి రోజు ట్రెడిషనల్ డే, రెండో రోజు సాంస్కృతి కార్యక్రమాలు, చివరి రోజు మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు.

**ఎక్సైజ్ సీఐ పై చర్యలు తీసుకోవాలి**

హన్మకొండ: గిరిజన మహిళను కులం పేరుతో దూషిస్తూ చేయి చేసుకున్న ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ సునీల్ నాయక్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లాలోని జాన్‌పాకకు బతుకుదెరువు కోసం వచ్చి నివసిస్తున్న గిరిజన మహిళను ప్రధానరహదారి నుంచి ఇంటికి వెళ్తుండగా ఎక్సైజ్ సీఐ రమేష్ చంద్ర, ఇద్దరు కానిస్టేబుళ్లు దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా కొట్టారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. దాడి చేసిన ఎక్సైజ్ సీఐ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**రైల్వే ఆలయంలో అన్నదానం**

కాజీపేట రూరల్ : స్థానిక రైల్వే దేవాలయ సముదాయంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం అన్నదానం జరిగింది. ఆలయ కమిటీ సెక్రటరీ పి.భాస్కర్‌రావు, అడ్వైజర్లు ఎఎస్‌ఆర్.ప్రసాదరావు, పీఎస్ఎస్.మూర్తి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ప్రతి మంగళవారం ఆలయంలో అన్నదానం చేయనున్నారు.

**చట్టసభల్లో స్థానం కల్పించాలి**

కేయూ క్యాంపస్ : తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ సంగంరెడ్డి పృథ్వీరాజ్‌యాదవ్‌కు చట్టసభల్లో స్థానం కల్పించాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ కోరారు.రాష్ట్రసాధనలో కీలకభూమిక పోషించిన పృథ్వీరాజ్ యాదవ్‌కు చట్టసభల్లో స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్యార్థులకు సన్మానం**

కాజీపేట: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ టెస్ట్ (కాట్)లో కాజీపేట శ్రీచైతన్యకు చెందిన 83 మంది విద్యార్థులు పలు కేటగిరిల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు వారిని పాఠశాలలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బండారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ, పోటీ పరీక్షలపై అధ్యయనంతోనే అన్ని అంశాల్లోనూ రాణించి నగదు పురస్కారాలను అందుకున్నారన్నారు.

**ముట్టడిని విజయవంతం చేయాలి**

హన్మకొండ: జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్‌తో చేపట్టిన చలో పార్లమెంట్ ముట్టడికి బీసీలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నీలం వెంకటేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్ పిలుపునిచ్చారు. బీసీల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

**ఫ్లెక్సీ చించివేతపై మండిపాటు**

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అయోధ్య రామమందిర నిర్మాణ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. ఆకతాయిలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీరాముని భక్తులు డిమాండ్ చేశారు. ఫ్లెక్సీ చించివేతపై వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేశ్‌లు మండిపడ్డారు.

**సమాఖ్య భావన అవసరమైన తరుణం**

కేయూ క్యాంపస్: సమాఖ్య భావన అవసరమైన తరుణమని కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్‌అన్నారు. మంగళవారం యూనివర్సిటీలోని బాటనీ విభాగం సెమినార్ హాల్‌లో వరంగల్ శాంతి సంఘం ఆధ్వర్యంలో ఆ సంస్థ ఇన్‌చార్జ్ ఆచార్య మహ్మద్ ముస్తాఫా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతి, సామరస్యం, సమాఖ్యభావన గొప్పదన్నారు.

## అక్రమ పదోన్నతిని రద్దుచేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఓ మహిళా ల్యాబ్ అసిస్టెంట్‌కు సూపరింటెండెంట్‌గా అక్రమంగా పదోన్నతి కల్పించారని ఆ పదోన్నతిని రద్దు చేయాలని రెండోరోజు మంగళవారం కేయూ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు ఎల్.యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, యూనివర్సిటీ ఇతర బాధ్యులు అధికారులను డిమాండ్ చేశారు. రద్దు పరుస్తామని ఈనెల 22న హామీ ఇచ్చి మీరు రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆయా సంఘాల బాధ్యులు రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుతో వాగ్వాదానికి దిగారు. గతంలో సూపరింటెండెంట్ పదోన్నతి కోసం రాత పరీక్షరాసి ఉత్తీర్ణులైన వారు ఐదుగురు ఉద్యోగులు మంగళవారం కేయూ రిజిస్ట్రార్‌కు విన్నవించి వినతిపత్రాలు ఇచ్చారు. సీనియారిటీ కోటాకింద తమకు కూడా సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పించాలని మరో ఇద్దరు మహిళా సీనియర్ అసిస్టెంట్లు రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు.

## కేవీలో ఆకట్టుకున్న డ్రాయింగ్ పోటీలు

కాజీపేట అర్బన్ : మండలంలోని కడిపికొండలో పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతి సందర్భంగా పరాక్రందివస్ నిర్వహించడంతో పాటు రెండు అంశాలపై డ్రాయింగ్ పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి తెలిపారు. డ్రాయింగ్ పోటీల్లో నగరంలోని పది స్కూల్స్ విద్యార్థులు పాల్గొని పీఎం చిట్కాలు, చంద్రయాన్, స్పోర్టీవ్ సక్సెస్, వికసిత్ భారత్‌లను చిత్రీకరించారు. ఉత్తమ డ్రాయింగ్‌లకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ వి.రమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మామునూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీఎస్‌ఎస్పీ నాలుగు, ఐదు బెటాలియన్ల కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డి, టీఎస్‌ఎస్పీ పోలీస్ రిటైర్డ్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, కృష్ణవేణి హైస్కూల్ ఎండీ. పట్నాల శ్రీనివాస్ సూచించారు. గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బెటాలియన్‌లోని క్రీడామైదానంలో హైస్కూల్స్ హెచ్‌ఎంలు సత్యనారాయణ, శిరీషా, కల్యాణ్‌రామ్, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో 23,24 తేదీల్లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహం.. ఉల్లాసంగా మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ వి. సురేందర్, అసిస్టెంట్ శ్రీనివాస్, రాంబాబు, సోమని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలు మానసికోల్లాసానికి దోహదం**

కేయూ క్యాంపస్: క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఏబీవీపీ విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ ఏలేటి నాగరాజు అన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ ( ఏబీవీపీ) హనుమకొండ జిల్లా శాఖ, సామజగన్మోహన్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ హెరిటేజ్ 2024 క్రీడాపోటీలను హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ మైదానంలో ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అయిలయ్య ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్, ప్రభాకర్, లవన్‌కుమార్, హర్షవర్ధన్, నిఖిల్, సుజిత్, దేవేందర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యావిధానంపై సంతకాల సేకరణ

విద్యారణ్యపురి: నూతన జాతీయ విద్యావిధానంను రద్దు చేయాలని అందుకు భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్ కోరారు. మంగళవారం హనుమకొండలో నూతన జాతీయ విద్యావిధానంపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చారని జాతీయ విద్యావిధానం–2020ని వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, బాధ్యులు రవితేజ, కుశాల్, కాంగ్రెస్ నాయకులు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

**జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలి**

ఖిలా వరంగల్: రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం–2020ను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కోరారు. మంగళవారం వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఈపీపై సంతకాల సేకరణ నిర్వహించారు.